నిర్లక్ష్యం వహిస్తే సహించం!



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం తాగునీటి లైన్‌మెన్‌లు, విద్యుత్ కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో తాగునీటి సరఫరా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. డివిజన్లలో లీకేజీలు, వీధిలైట్ల రిపేర్లు 24 గంటల్లో చేయించాలన్నారు. రోజువారీ విధి నిర్వహణలో తమ సంబంధిత ఏరియాలో తిరుగుతూ సమస్యలను గుర్తించి వాటి సత్వర పరిష్కారానికి చేయాల్సిన చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, వాటర్‌లైన్‌మెన్స్, విద్యుత్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మొక్కల ఆరోగ్య నిర్వహణపై సదస్సు


పీపీఏఐ కార్యాలయంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శరత్‌బాబు

ఏజీవర్సిటీ: వ్యవసాయ రంగంలో భారత్ ప్రతిష్టాత్మక శాస్త్ర పరిశోధనా సంఘమైనా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మొక్కల ఆరోగ్య నిర్వహణ, ఆవిష్కరణలు సుస్థిర ప్రధాన అంశంగా అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు పీపీఏఐ అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ బి. శరత్‌బాబు తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని పీపీఏఐ కార్యాలయంలో అసోసియేట్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సదస్సు వివరాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిఏటా చీడపీడలు, తెగుళ్ల వల్ల పంట దిగుబడులు 20 నుంచి 40 శాతం తగ్గుతున్నాయని, ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ నివేదిక వెల్లడించిందన్నారు. వాతావరణ మార్పులు పంటల సాగుపై గణనీయమైన ప్రభావాలను చూపుతున్నాయన్నారు.

◆ చీడపీడలు, తెగుళ్లు పెరుగుతుండటంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని పేర్కొన్నారు. వీటిపై చర్చించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

◆ ఈ సదస్సు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సును రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతి ఎం. రఘునందన్‌రావు ప్రారంభిస్తారని తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి, భారత వ్యవసాయ పరిశోధన మండల ప్లాంట్ ప్రొటెక్షన్ ఏడీజీ సునీత్‌చంద్రదూబేతో పాటు ఇతర అధికారులు పాల్గొంటారన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని 11,12వ డివిజన్‌లలో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటి చెత్తను వంద శాతం చెత్త సేకరణ కార్మికులకు అందించేలా చూడాలని కార్మికులు, సిబ్బందికి సూచించారు. రోడ్లపై వ్యర్థాలను వేయకుండా అవగాహన పెంచాలన్నారు. ప్రజలు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకే చెత్తను అందించాలని సూచించారు. శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన కార్తీకమాస శోభ



పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం


ఆకాశదీపానికి పూజలు చేస్తున్న భక్తులు

మణికొండ: హిందువులకు పవిత్రమాసాలలో ఒకటైన కార్తీకమాస పూజలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ శ్రీ పార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాల్‌గూడ కాశీవిశ్వేశ్వరాలయం, మంచిరేవుల మచిలేశ్వరస్వామి క్షేత్రాలలో తెల్లవారు జాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివకేశవులను ఈ మాసం మొత్తం కొలిచేందుకు పెద్ద ఎత్తున భక్తులు సిద్ధమయ్యారు. కార్తీకమాసంలో కొందరు భక్తులు ఉపవాస దీక్షలు, దీపాలంకరణ, అభిషేకాలు, అర్చనలు, ఆకాశదీపాల దర్శనాలు నిర్వహిస్తూ.. ఆ దేవుళ్లను తమను చల్లగా చూడాలని వేడుకుంటారు. కార్తీకమాసంలో ప్రతీ సోమవారం, కార్తీక పౌర్ణమి రోజు భక్తులు పెద్దఎత్తున దేవాలయాలకు వచ్చి పూజలు, అభిషేకాలు, దీపాలను వెలిగిస్తారు. ఆదికేశవులిద్దరికీ పవిత్ర మాసంగా నిలవటంతో పాటు భక్తులకు ముక్తి మార్గాన్ని ప్రసాదించే మాసంగా కార్తీకమాసాన్ని హిందువులు పాటిస్తారు. కార్తీకమాసం సందర్భంగా ఆయా ఆలయాలను అందంగా అలంకరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆయా దేవాలయాల కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. మొదటి రోజు భక్తులు పెద్దఎత్తున ఆయా దేవాలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.


వట్టినాగులపల్లిలో సమస్యల ఏకరువు

- బీఆర్‌ఎస్ ప్రచారానికి అడ్డగింపు
- నచ్చజెప్పి తిరిగి ప్రచారం చేసిన నాయకులు


నాయకులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

మణికొండ: ఏళ్లు గడిచినా తమ గ్రామంలో రోడ్డు పనిపూర్తి చేయించలేక పోయారని, దళితబంధు, డబుల్ బెడ్రూం, విప్రో భూ బాధితులకు సరైన న్యాయం చేయలేదంటూ.. వట్టినాగులపల్లికి చెందిన గ్రామస్తులు బీఆర్‌ఎస్ ప్రచారాన్ని అడ్డుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. శేరిలింగంపల్లి నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు వరకు వట్టినాగులపల్లి మీదుగా వంద అడుగుల రోడ్డు పనులు ఏళ్లు గడుస్తున్నా.. పూర్తి కాలేదు. పలుసార్లు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను రోడ్డు పనులను పూర్తి చేయించాలని, డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని, విప్రో భూ బాధితులకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ పనులేవీ పూర్తి కాలేదని చెబుతూ.. కొందరు గ్రామస్తులు బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మాజీ ఎంపీపీ, పార్టీ సమన్వయకర్త తలారి మల్లేష్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నగేష్‌యాదవ్‌లు వారికి నచ్చజెప్పారు. రోడ్డు పని సగానికిపైగా పూర్తైందని, పనులు జరుగుతున్నాయన్నారు. విప్రో భూమి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి పరిహారాలు ఇచ్చే పథకాలు లేనందునే న్యాయం చేయలేకపోయామన్నారు. డబుల్‌బెడ్రూంలు, దళిత బంధు నిరంతర ప్రక్రియలని వచ్చే ప్రభుత్వంలో న్యాయం చేస్తామని నచ్చచెప్పి యధావిధిగా ప్రచారం నిర్వహించుకున్నారు.

ఉచిత షుగర్ పరీక్షలు



హఫీజ్‌పేట్ : ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ఉచితంగా చక్కెర వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ మధుమేహ వ్యాధి నియంత్రణకు కృత్రిమ ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత ఫ్రెడరిక్ బాంటింగ్ గౌరవార్థం నవంబర్ 14వ తేదిన ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. నిత్యం వ్యాయమం, నడక, మానసిక ప్రశాంతత ఉంటే రోగాలు దరిచేరవన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినీ,విద్యార్థులు

- జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు
- పాఠశాలల్లో అలరించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

అత్తాపూర్: అత్తాపూర్‌లోని భానోదయ పాఠశాలలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ (చాచా నెహ్రూ) పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషాధారణలో పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, పాఠశాల సిబ్బంది, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ విన్యాసాలు, నాట్యాలతో పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధ మాట్లాడుతూ.. చాచా నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటామని, ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టమని బాలల దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం చిన్నారులు ఆటపాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి బాలల దినోత్సవ ప్రత్యేకతను ప్రిన్సిపల్ నిషాంత్ తన్వీర్ వివరించారు. డీన్ ప్రియామనీష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

బీఎస్పీకి విద్యార్థి సంఘం మద్దతు

రాయదుర్గం: తెలంగాణ శాసనసభ ఎన్నికలలో పోటీ చేస్తున్న బహుజన సమాజ్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు హెచ్‌సీయూలోని బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్ఎఫ్) నాయకుడు జోగు రమేష్ తెలిపారు. బీఎస్ఎఫ్ హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలోబీఎస్ఎఫ్ అధ్యక్షుడు చిలుక హరీష్, నాయకులు కత్తి అనిల్, అసుర పరుశురామ్, శంకర్, జగదీష్, మల్లేష్, ధనుష్, యాసీన్, చంద్రదీప్, పాల్గొన్నారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సెషన్‌కు ప్రొ.అజీజుద్దీన్

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ (ఏపీహెచ్‌సీ సెషన్‌లో హిస్టారియోగ్రఫీ విభాగానికి 'మనూ'లోని ఉర్దూ కల్చర్ స్టడీస్ సెంటర్ గౌరవ ప్రొఫెసర్ ఎస్ఎం అజీజుద్దీన్ హుస్సేన్‌ను ఎంపిక చేశారు. 2024 జనవరిలో విశాఖ పట్నంలో ఏపీహెచ్‌సీ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో హిస్టారియోగ్రఫీ విభాగానికి అధ్యక్షత వహించడానికి ప్రొఫెసర్ అజీజుద్దీన్‌ను ఆహ్వానించారు.

లింగంపల్లిలో గ్యార్మి షరీఫ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి కూరగాయల మార్కెట్‌లో గ్యార్మిషరీఫ్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలోమార్కెట్ కమిటీ అధ్యక్షుడు వీరేశంగౌడ్, ఉపాధ్యక్షుడు షేక్ ఖాజాపాషా, హబీబ్,మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, శ్రీనివాస్ రాజ్‌ముదిరాజ్, జనార్దన్ రెడ్డి, అజీమ్ పాల్గొన్నారు.

కార్తీక పూజలు


చంద్రమౌళీశ్వరస్వామి

రాయదుర్గం: కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, అష్టోత్తర పూజ చేశారు. భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయం ప్రాంగంలో సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. అలాగే టెలికామ్‌నగర్‌లో సాయిదత్త గణపతి ఆలయంలో కాశీ నుంచి తీసుకొచ్చిన స్పటిక లింగానికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హైదర్షాకోట్‌లో సదర్ సమ్మేళనం


సదర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో సదర్ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాశం కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేసి సమ్మేళనానికి తీసుకొచ్చారు. దున్నపోతులచే వివిధ రకాల విన్యాసాలు చేయించారు. కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా రాందాస్‌ముదిరాజ్, యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

'రాజేంద్రనగర్‌లో కమల వికాసం'


ఎన్నికల ప్రచారంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి

అత్తాపూర్: రాజేంద్రనగర్‌లో ఈసారి తమ గెలుపు ఖాయమని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అత్తాపూర్ హైదర్‌గూడలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ ఎన్నికల చిహ్నం కమలం వికాసంతోనే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పౌర సదుపాయాలను మెరుగుపరిచి ప్రజల జీవనం సుఖమయం చేయడమే తమ మొదటి ప్రాధాన్యమన్నారు. రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థను చక్కదిద్దే సమగ్ర ప్రణాళిక తన వద్ద ఉందన్నారు. పారిశ్రామిక వ్యర్థాలను కాలనీల్లోకి రానివ్వకుండా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. పారిశ్రామిక కార్మికుల పని స్థలాల్లో సరైన వసతులపై దృష్టి పెడుతానన్నారు. మొక్కలు నాటించి గ్రీనరీని మెరుగుపరిచి కాలుష్యం తగ్గించే పనులకు శ్రీకారం చుడతానన్నారు. బీజేపీ నాయకులు నారగూడెం మల్లారెడ్డి, మోహన్‌రావు, సంగీత గౌరీ శంకర్, నాయకులు బొక్క బాల్‌రెడ్డి, సుల్గే వెంకటేశ్, ఆర్.సుధాకర్, కె.విజయ్‌కుమార్, మణికంఠ, బాలకృష్ణ, సతీష్, పవన్‌యాదవ్, రాము, ఎం.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతివేగానికి ఇద్దరి బలి

- ద్విచక్రవాహనంతో మహిళను ఢీకొట్టిన మైనర్
- మహిళతో పాటు బాలుడి మృతి


మృతిచెందిన సులేమాన్


నర్సమ్మ (ఫైల్)

శంషాబాద్: ద్విచక్రవాహనం కొనుగోలు చేసి ఇంటికి వెళుతున్న ఓ మైనర్ బాలుడు మహిళను ఢీ కొన్న సంఘటనలో మహిళతో పాటు బాలుడు మృతి చెందిన విషాద సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం..పట్టణంలోని సూరజ్ గార్డెన్‌లో నివాసముంటున్న సయ్యద్ సులేమాన్ (17) అనే బాలుడు స్థానికంగా ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఓఎల్ఎక్స్‌లో బుక్ చేసుకున్న ద్విచక్ర వాహనాన్ని సోమవారం రాత్రి స్నేహితుడితో కలిసి వెళ్లి అత్తాపూర్‌లో కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన వాహనాన్ని తానే నడిపిస్తూ శంషాబాద్‌కు బయలుదేరాడు. పట్టణంలోని సాతంరాయి ఫ్లైఓవర్ దాటిన తర్వాత రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా ఢీ కొట్టడంతో వాహనం కిందపడిపోయింది. దీంతో గాయపడిన బాలుడిని అతని వెంటే మరో వాహనంపై వచ్చిన స్నేహితుడు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇక రోడ్డుపై గాయాలతో పడి ఉన్న మహిళ గురించి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని చూసేలోగా ఆమె మృతిచెంది ఉండడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మహిళ మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామానికి చెందిన నర్సమ్మగా గుర్తించారు. నగరంలో నర్సరీల్లో పనిచేస్తున్న ఆమె మూడు రోజుల కిందట అదృశ్యమై చివరికి రోడ్డుప్రమాదంలో మృతిచెందినట్లు ఆమెకుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

మణికొండ: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పార్టీ అధ్యక్షుడు కె. అశోక్ యాదవ్, ఎం. జితేందర్‌ల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం రెండు మున్సిపాలిటీల పరిధిలోని పలు వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి స్థానికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉంటే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

'చేతికి చేయూతనివ్వండి'

అత్తాపూర్: 'కారును పారద్రోలండీ... చేయికి చేయూతనివ్వండి' అంటూ కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్‌కు ఓటు వేయాలని అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం గోవర్ధన్‌రెడ్డి, బండారి రమేష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అత్తాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్‌కు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి అవినీతి సర్కార్‌ను ఇంటికి పంపించమని విజ్ఞప్తి చేశారు. 60 ఏళ్ల తెలంగాణ జాతి ఆకాంక్షను నెరవేర్చిన సంగతిని గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాలను వివరిస్తూ నడక ప్రచారం నిర్వహించారు. కె.సుధాకర్‌రెడ్డి, గుమ్మకొండ హనుమంత్ రెడ్డి, రవీందర్‌గౌడ్, ఖలీద్, రాజు, మహేందర్, వనం మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేపీ ప్రచారం

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో బీజేపీ నాయకులు శివరాంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ నాయకులు సామ నరేందర్‌రెడ్డి, హరికిషన్‌జీ, సోల్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, మల్లేష్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఇంద్రారెడ్డి, రాజశేఖర్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ, జూకల్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ తరపున స్థానిక నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బుచ్చమ్మ, నాయకులు రమేష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరు'

బండ్లగూడ: బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ.. ఆపలేరని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ బండ్లగూడ జాగీర్ పాత గ్రామంలో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని బీఆర్‌ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎదురు లేని శక్తిగా ఉందన్నారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలమన్నారు. కార్యకర్తల బలంతోనే ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు బీఆర్‌ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరుతున్నామన్నారు. అభివృద్ధిని వివరించి మరోసారి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విజయానికి సహకరించాలని కోరుతున్నామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, తలారి చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు నాగరాజు, పాపయ్య యాదవ్, రాజిరెడ్డి, జగదీష్, కట్టసాయిబాబాగౌడ్, రాజు, మల్లేష్ యాదవ్, సుందర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సుమన్‌గౌడ్ తదితరులున్నారు.

'బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం'

అత్తాపూర్: ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు హ్యాట్రిక్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను వరుసగా నాలుగోసారి గెలిపించుకుంటామని జిల్లా సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసే ప్రభుత్వంలో మంత్రిగా చూడాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రచారంలో భాగంగా అత్తాపూర్ డివిజన్ తేజస్వినీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని చూపిస్తూ.. అనతి కాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పీఎం రెడ్డి, ముఖేశ్, అప్పారెడ్డి, శివారెడ్డి, మహేష్, నరేందర్, కృష్ణ, రవి తదితరులున్నారు.

సంక్షేమ పథకాలే మెజార్టీకి పునాదులు

శంషాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు భారీ మెజార్టీని అందిస్తాయని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వై. కుమార్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను నాల్గోసారి గెలిపించేందుకు ప్రజలు సన్నద్ధంగా ఉన్నారన్నారు. ప్రత్యర్థి పార్టీలు చిత్తుకావడం ఖాయమని, బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

సాయికుమార్‌ను కలిసిన బీజేపీ నేతలు



మణికొండ: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని మణికొండ నాయకులు సినీనటుడు సాయికుమార్‌ను కోరారు. మంగళవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన నివాసానికి వెళ్లి బీజేపీ నాయకులు ఆయనను కలిసి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి గురించి వివరించారు. జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ఇందిర, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, కౌన్సిలర్ వందనానగేష్, నాయకులు ఆనంద్‌రావు తదితరులున్నారు.

నియామకం


నియామకపత్రాన్ని అందుకుంటున్న రాఘవేంద్రచారి

రాజేంద్రనగర్: విశ్వ బ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శిగా రాజేంద్రనగర్ మండల బుద్వేల్ ప్రాంతానికి చెందిన బుదోజు రాఘవేంద్రచారి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు సంఘం అధ్యక్షుడు పులిగిళ్ల శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి పెద్దకొలిమి బ్రహ్మచారి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాఘవేంద్రచారి సంఘం ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230